సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 13 । సెప్టెంబర్ । 2024



ఏ క్షణం.. ఏం జరుగునో !

జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు శిథిలావస్థకు చేరగా ఎప్పుడేమవుతుందోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. 8లో



.. ఎంత చేసినా తక్కువే

వరద బాధితులను ప్రత్యక్షంగా చూస్తుంటే ఎంత చేసినా తక్కువే అన్నట్లుగా ఉందని ఎమ్మెల్సీ కోదండరామ్ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రత నమోదవుతుంది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



ఆలయంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, స్వామివారిని అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆలయ అర్చకులు 108 సువర్ణ పుష్పాలతో గురువారం వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత నివేదన, హారతి, మంత్రపుష్పం సమర్పించారు. కార్యక్రమంలో వేదపండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు

18న చండీహోమం

పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 18న చండీహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే భక్తులు రూ.2,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని సూచించారు. హోమం సమయంలో సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 63043 08458 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భోజనం సక్రమంగా లేకుంటే చర్య తప్పదు



భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ తదితరులు

పాల్వంచ: పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరా చారి అన్నారు. పట్టణంలోని ఎంపీయూపీఎస్ వికలాంగుల కాలనీ పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. భోజనం వడ్డించే సమయంలో ఉపాధ్యాయులు పర్యవేక్షించకపోవడం సరైంది కాదన్నారు. ఎవరో ఒక ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకుని తనిఖీచేయాలని, పిల్లలకు సక్రమంగా అందుతోందా అని చూడాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అన్నారు. ఆయన వెంట కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి ఎస్‌కే.సైదులు, ప్లానింగ్ కో ఆర్డినేటర్ ఎస్.సతీష్‌కుమార్, ఎంఈఓ శ్రీరామ్మూర్తి ఉన్నారు.

మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతి నెమ్మదిగా తగ్గుతోంది. బుధవారం ఉదయం 50.60 అడుగులకు చేరిన నీటిమట్టం క్రమంగా తగ్గుతూ గురువారం ఉదయం 11 గంటలకు 42.70 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. అయితే దిగువన గల శబరి నది ప్రవాహం ఉధృతంగా ఉండడంతో భద్రాచలం నుంచి విలీన మండలాలకు రాకపోకలు సాగడం లేదు. పలువురు భక్తులు ఐదో రోజు నుంచే గణేశ్ నిమజ్జనానికి భద్రాచలం వస్తుండడంతో ఎవరూ గోదావరిలో దిగకుండా అధికారులు లాంచీలు ఏర్పాటు చేశారు.



భద్రాద్రికి ఎస్టీపీ!

గోదావరిలో కలుస్తున్న పట్టణ మురుగునీరు

- వరదలప్పుడు వెనక్కు వస్తున్న వైనం
- స్లూయిస్ దిగువనే స్నానఘట్టాలు
- ప్రతీ ఏడాది టెంపుల్ టౌన్‌కు తప్పని డ్రెయినేజీ తిప్పలు
- తెరపైకి సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రతిపాదనలు

భక్తుల ఇబ్బందులు తొలగించడంతో పాటు పట్టణ వాసులు, వ్యాపార వర్గాలకు ఉపయోగపడేలా భద్రాచలంలో మురునీటి శుద్ధి కేంద్రం (సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ – ఎస్టీపీ) ఏర్పాటుకు ప్రతిపాదనలకు సిద్ధమవుతున్నాయి. గోదావరి వరదల సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇచ్చిన సూచనలతో ఎస్టీపీ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

పీడిస్తున్న మురుగు సమస్య

సీతాసమేత శ్రీరాముడు కొలువైన భద్రాచలానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. వారంతా గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తుంటారు. అయితే స్నానఘట్టాలకు ఎగువ భాగంలో భద్రాచలం నుంచి వచ్చే మురుగునీరు కలిసే స్లూయిస్‌లు ఉన్నాయి. ఈ అంశంపై అనేక ఏళ్లుగా చర్చ జరుగుతున్నా సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడిన దాఖలాలు లేవు. పైగా గోదావరి నదిలో వరద ఎత్తు 30 అడుగుల వరకు చేరితే మురుగునీరు స్లూయిస్‌ల ద్వారా నదిలోకి వెళ్లే వీలు లేదు. ఈ నీటిని మోటార్ల ద్వారా నదిలోకి ఎత్తి పోయాల్సి వస్తుంది. ప్రతీ వానాకాలంలో ఈ పని చేయాల్సి వస్తోంది.

ఇక గోదావరికి వరద, భద్రాచలం పట్టణంలో వర్షం ఒకేసారి వస్తే స్లూయిస్‌ల గుండా వరద, ముగురునీరు వెనక్కి మరలి విస్తా కాంప్లెక్స్, పోకల దమ్మక్క అన్నదాన సత్రంతో పాటు ఆలయం కొలువైన భద్రగిరి కొండ చుట్టూ కూడా చేరుతున్నాయి. ఫలితంగా నిమిషాల వ్యవధిలో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. నీరు ఎత్తిపోసిన తర్వాత మిగిలే బురద, బ్లీచింగ్ తదితర వ్యవహారాలతో ఆలయ పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతతో పాటు ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతింటోంది.

నాలుగు రాష్ట్రాల ఏజెన్సీ హబ్‌గా..

వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రాచలాన్ని అధికారికంగా మున్సిపాలిటీ చేయకున్నా ఆ మేరకు జనాభా పెరుగుతూనే ఉంది. ఒకప్పుడు టెంపుల్‌టౌన్‌గా పేరు గాంచిన భద్రగిరి క్రమంగా విద్య, వైద్య రంగాల్లో తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాలకు హబ్‌గా మారింది. ఆధ్యాత్మిక కేంద్రంగా పట్టణానికి ఉన్న ప్రాశస్త్యం, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ అమలు చేయాల్సి ఉండగా ఆ అంశం ఇంత కాలం నిరాదరణకు గురైంది. తాజాగా గోదావరి వరదల సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాచలం మాస్టర్ ప్లాన్ అంశంపై దృష్టి సారించాలని జిల్లా అధికారులకు సూచించారు. అలాగే పట్టణంలో వెలువడి, గోదావరిలో కలుస్తున్న మురుగు నీటిని దృష్టిలో పెట్టుకుని సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. దీంతో పట్టణంలో ఎన్ని ముగురు కాల్వలు ఉన్నాయి. వాటి ప్రవాహ తీరుతెన్నులు, ఎంత మురుగు పట్టణం నుంచి వెలువడుతుంది అనే అంశాలను ఆరా తీసే పనిలో అధికారులు ఉండనున్నారు. అదే విధంగా స్థల లభ్యత విషయంలో తీవ్రమైన కొరత ఎదుర్కొంటున్న భద్రాచలం పరిసరాల్లో మురుగు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు గల అనువైన ప్రదేశం ఎక్కడుందనే అంశంపై కూడా ఫోకస్ చేయనున్నారు.

పరిశ్రమలపై ఆరా..

భద్రాచలం దగ్గర గోదావరి స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలని, ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా మంత్రి తుమ్మల జిల్లా అధికారులకు సూచించారు. ముఖ్యంగా భద్రాచలం ఎగువ భాగంలో ఉన్న భద్రాచలం పేపర్ బోర్డు లిమిటెడ్, మణుగూరు భారజల కర్మాగారం నుంచి గోదావరిలో కాలుష్య జలాలు ఏమైనా విడుదల అవుతున్నాయా అనే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. పరిమితికి మించి కాలుష్య జలాలను గోదావరిలో విడుదల చేసే ఫ్యాక్టరీ యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని కూడా సూచించారు. మొత్తంగా పవిత్ర భద్రాచల క్షేత్రం పరిసరాల్లో పావన గోదావరిని పరిశుభ్రంగా ఉంచడం, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు భద్రాచలంలో ఇబ్బందులు రాకుండా చూడడంపై రాష్ట్ర సర్కార్ దృష్టి సారిస్తోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

ఏచూరి మృతిపై ఎమ్మెల్యే కూనంనేని సంతాపం



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి, పక్కన నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషాతో కలిసి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యావేత్త అయిన ఏచూరి అనేక ప్రజా, కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించారని కొనియాడారు. పార్టీలో చేరిన అనతికాలంలోనే అంచెలంచెలుగా ఎదిగి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

దేశం మార్క్సిస్టు మేధావిని కోల్పోయింది..

సింగరేణి(కొత్తగూడెం): ఒక కమ్యూనిస్టు యోధుడిని, మార్క్సిస్టు మేధావిని దేశం కోల్పోయిందని, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. కొత్తగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సంతాపసభలో ఆమె మాట్లాడారు. ఏచూరి విద్యార్థి దశలోనే వామపక్ష భావజాలం పట్ల ఆకర్షితులై తుదిశ్వాస విడిచే వరకు ఎర్రజెండా నీడలోనే పయనించారని నివాళులర్పించారు. నేటి తరానికి ఆయన ఆదర్శనీయుడని అన్నారు. దేశంలో లౌకిక పార్టీలను ఏకం చేయడంలో ఏచూరి కీలక పాత్ర పోషించారని చెప్పారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్యచ ఏజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఎంపీ బలరామ్ అభినందన



వంశీతో ఎంపీ బలరామ్ నాయక్ తదితరులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు మోడెం వంశీని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అభినందించారు. గురువారం హైదరాబాద్‌లో ఎంపీని కలిసిన జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సభ్యులు వంశీకి ప్రభుత్వం తరఫున చేయూత అందించాలని వినతిపత్రం అందజేశారు. యూరప్ ఖండంలోని మాల్టా దేశంలో ఆగస్టు 28 నుంచి ఈనెల 3 వరకు జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం సాధించాడని ఎంపీకి వివరించారు. అంతేకాక ఈనెల 4 నుంచి 13 వరకు దక్షిణాఫ్రికా సన్‌సిటీలో జరిగే కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు తెలంగాణ నుంచి వంశీ ఎంపికయ్యాడని తెలిపారు. అనంతరం బలరామ్ నాయక్ మాట్లాడుతూ.. వంశీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసేలా ఏర్పాటు చేస్తానని, ఆర్థికంగా ఆదుకునేందుకు తనవంతు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భోగాల శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ జీ.వి. రామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ ప్రసాద్, కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజీ పాల్గొన్నారు.

కాళ్లపై పడి... కన్నీటి పర్యంతం

- మున్నేరు పరీవాహకంలో కేంద్ర బృందం పర్యటన
- దెబ్బతిన్న ఇళ్లను చూడాలని మహిళల వేడుకోలు
- మున్నేటిని పరిశీలించి, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించిన అధికారులు
- వరద ప్రభావం, నష్టాన్ని వివరించిన ఖమ్మం కలెక్టర్, కేఎంసీ కమిషనర్



మున్నేరు వరద ఎక్కడి వరకు వచ్చిందో కేంద్ర బృందానికి వివరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంవన్‌టౌన్: 'ఉన్నదంతా వరదల్లో కొట్టుకుపోయి కట్టుబట్టలతో మిగిలాం.. మా ఇళ్లకు రండి.. జరిగిన నష్టాన్ని చూడండి' అంటూ కేంద్ర బృందంలోని అధికారులను మున్నేరు ముంపు బాధితులు కోరారు. మున్నేటి వరదతో ఎదురైన విపత్తును పరిశీలించేందుకు జిల్లాలో కేంద్ర బృందం పర్యటన రెండో రోజైన గురువారం కూడా కొనసాగింది. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ అడ్వైజర్ కల్నల్ కే.వీ..సింగ్ నేతృత్వాన మహేష్ కుమార్, శాంతినాథ్ శివప్ప, ఎస్.కే.కుష్వాహ, టి.నియాల్ కన్సన్, డాక్టర్ శశివర్ధన్‌రెడ్డితో కూడిన కేంద్ర బృందం రెండుగా విడిపోయి ఖమ్మం కాల్వొడ్డులోని బొక్కలగడ్డ, ప్రకాష్‌నగర్ మున్నేరు బ్రిడ్జి, మోతీనగర్‌తో పాటుఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని రాజీవ్ గృహకల్ప, దానవాయిగూడెం, తల్లంపాడు, తెల్దారుపల్లి, తనగంపాడుల్లో పర్యటించింది. ఈసందర్భంగా జరిగిన నష్టం వివరాలను ఫొటో ఎగ్జిబిషన్ల ద్వారా వారికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య వివరించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించిన బృందం సభ్యులు త్వరగా ముంపు ప్రాంతాలను పూర్వ స్థితికి తీసుకొచ్చారని అధికారులను అభినందించారు. మున్నేరు సమీపాన బొక్కలగడ్డలో కూలిన ఇళ్లను పరిశీలించగా అక్కడే ఉన్న బాధిత మహిళ కారపాక స్వరూప 'మాకు మీరే దిక్కు' అంటూ కేంద్ర బృందంలోని అధికారుల కాళ్లపై పడి ఆవేదన వ్యక్తం చేసింది. తాను, తన భర్త కూలీ పనులు చేస్తేనే జీవనం, ఇప్పుడు ఇల్లు కూలడంతో రోడ్డున పడ్డామని తెలిపింది. అలాగే, నయాబజార్ కళాశాలలో నష్టాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి నుంచి ప్రకాష్‌నగర్ చేరుకోగా బ్రిడ్జికి వరదలతో జరిగిన నష్టం, కొట్టుకుపోయిన వైకుంఠ ధామం, ఆపై మోతీనగర్‌లోని మున్నేటి సమీపాన వరద ప్రభావం, దానవాయిగూడెం ఇన్ టేక్‌వెల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. బృందంతోపాటు రాష్ట్ర గనులు, భూగర్భ ఖనిజాల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఆర్డీఓలు జి.గణేష్, రాజేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, రాజీవ్‌గృహ కల్పలో పరిశీలన సందర్భంగా వరద ఎంత మేరకు వచ్చింది, గృహాలు ఎక్కడ వరకు మునిగాయని ఆరా తీసిన కేంద్రబృందం.. ఈ ఇళ్లు ఎప్పుడు కట్టారో తెలుసుకోవడమే కాక నాణ్యతపై ప్రశ్నించారు. నివాసానికి అనుగుణంగా ఉన్నాయో, లేదో నిపుణులతో పరీక్ష చేయించాలని చెబుతూ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

నాణ్యమైన వస్తువులే విక్రయించాలి



కిరాణా దుకాణంలో కాంటాను పరిశీలిస్తున్న మనోహర్

కరకగూడెం: వినియోగదారులకు నాణ్యమైన వస్తువులనే విక్రయించాలని జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ అన్నారు. కరకగూడెంలోని పలు కిరాణా దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. సీల్ లేని రెండు ఎలక్ట్రానిక్ కాంటాలను గుర్తించి ఇద్దరు వ్యాపారులకు రూ.11,500 జరిమానా విధించారు. అనంతరం మాట్లాడుతూ.. కాంటాలకు తప్పకుండా సీల్ వేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. వినియోగదారుల రక్షణే తమ లక్ష్యమని, తూకాలు, కొలతల విషయంలో ప్రజలను మోసం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజావసరాలు తీర్చడమే లక్ష్యం

- ఖమ్మం ఎంపీ రాఘురాంరెడ్డి
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటన



సింగరేణి ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి



వాగులో గల్లంతైన సాయికృష్ణ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ

పాల్వంచరూరల్/సింగరేణి(కొత్తగూడెం)/సుజాతనగర్/కొత్తగూడెం రూరల్ : ప్రజావసరాలు తీర్చడమే లక్ష్యంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఖమ్మం ఎంపీ రామసహాయం రాఘురాంరెడ్డి అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి కార్మికుల సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పుతానని అన్నారు. సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సొంతింటి పథకం, ఆదాయ పన్ను మినహాయింపు వంటి అంశాలపై లోక్‌సభలో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత పాల్వంచ మండలం గంగదేవిగుప్ప గ్రామానికి వెళ్లి ఇటీవల కిన్నెరసాని వాగులో గల్లంతైన జారే సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు. సాయికృష్ణ భార్య మమతకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

దంతలబోరులో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాకు చర్యలు చేపడతామని చెప్పారు. భారీ వర్షాలతో కిన్నెరసాని వాగు పొంగిపొర్లడంతో పక్కనున్న పొలాలు ముంపునకు గురయ్యాయని, ఇసుక మేటలతో తీవ్ర నష్టం వాటిల్లిందని, పరిహారం అందించాలని రైతులు కోరగా.. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. జగన్నాథపురంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన వారి రుణం తీర్చుకుంటానని చెప్పారు.

పర్యాటకంగా అభివృద్ధి చేస్తా..

సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం చెరువు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కృషి చేస్తానని రఘురాంరెడ్డి తెలిపారు. చెరువులో నీటి నిల్వ, గతంలో జరిగిన పనుల వివరాలపై ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. మండల కేంద్రంలో డ్రెయినేజీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరగా, సానుకూలంగా స్పందించారు. అనంతరం లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్‌నగర్‌లో వరసిద్ధి వినాయక మండపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ నారాయణ, ఇరిగేషన్ డీఈ భాస్కర్, ఏఈ కార్తీక్, పార్టీ నాయకులు నాగ సీతారాములు, కోనేరు చిన్ని, యర్రంశెట్టి ముత్తయ్య, బరపటి వాసుదేవరావు, కొండం వెంకన్న, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు, రజాక్, ఆళ్ల మురళి, నాగేంద్రత్రివేది, శంకర్‌నాయక్, మండే వీర హనుమంతరావు, చింతలపూడి రాజశేఖర్, భూక్యా రాంబాబు, బాగం మోహనరావు, బత్తుల కేశవరావు, లింగం పిచ్చిరెడ్డి, బానోత్ కోటేష్, చిమట నాగేశ్వరరావు, అబీద్, జేత్రాం, పూణెం శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం అంచనాకు క్షేత్రస్థాయి పరిశీలన



నాగినేనిప్రోలులో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఉమారెడ్డి

బూర్గంపాడు: భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. మండలంలోని నాగినేనిప్రోలు, ఉప్పుసాక గ్రామాల్లో భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ వర్షాలు, వరదలతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఉమారెడ్డికి వివరించారు. చాలాచోట్ల వరదలకు భూమి కోతకు గురైందని తెలిపారు. భూముల్లో ఇసుక, మట్టి మేటలు వేసి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయంటూ గోడు వెలిబుచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంటలు పూర్తిగా దెబ్బతిన్న చోట స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పాక్షికంగా దెబ్బతిన్న భూముల్లో నీరు నిల్వ లేకుండా కాలువల ద్వారా బయటకు పంపాలని చెప్పారు. వరదలతో మొక్కల వేర్లు సరిగా పనిచేయక ఆహారాన్ని తీసుకోలేవని, ఈ పరిస్థితుల్లో మైక్రో న్యూట్రియంట్లతో పాటు సప్లిమెంట్లు పిచికారీ చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. పంట నష్టంపై సమగ్ర పరిశీలన చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఓంప్రకాశ్, కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు రాయల శ్రీనివాసరావు, బి శివ, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు బి.తాతారావు, ఏఓ శంకర్, ఏఈఓలు జేవీడీ ప్రసాద్, శృతి, వైష్ణవి పాల్గొన్నారు.

మహిళలు స్వావలంబన సాధించాలి



పెరటికోళ్ల యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

చండ్రుగొండ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఓ విద్యాచందన సూచించారు. మండలంలోని తిప్పనపల్లి, బెండాలపాడు గ్రామాల్లో పెరటికోళ్ల పెంపకం యూనిట్లను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. పెరటికోళ్ల పెంపకంతో అధిక ఆదాయం సాధించవచ్చని అన్నారు. ఎంపీడీవో బయ్యారపు అశోక్, ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

'లక్ష్మీ' గణపతి

రూ.5 లక్షల కరెన్సీతో వినాయకుడికి అలంకరణ



గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పాండురంగాపురం శ్రీ రామాలయంలో ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయకుడి విగ్రహానికి గురువారం రూ.5 లక్షల విలువైన కరెన్సీ నోట్లను హారంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసి, స్వామివారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అర్థిమాల్ల శ్రీకాంత్, భరత్‌రెడ్డి, పవన్‌కుమార్, భాస్కర్, చందు, ఫణి, కిషోర్‌రెడ్డి, విశ్వనాథం, కొత్త కృష్ణ, కనికిరెడ్డి, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు. – పాల్వంచరూరల్

క్లుప్తంగా

ఎస్పీ చొరవతో రుణం మంజూరు



రెహమాన్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ఎస్పీ రోహిత్ రాజు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సమయంలో తన వద్ద గన్‌మాన్‌గా పనిచేసిన షేక్ ఇమామ్‌కు ఎస్పీ రోహిత్‌రాజు చొరవ తీసుకుని పోలీస్ శాఖ నుంచి భద్రత లోన్ ఇప్పించారు. గన్‌మాన్ కుమారుడు రెహమాన్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో పరిస్థితిని తెలుసుకుని పోలీస్‌శాఖ నుంచి వచ్చే భద్రత సహాయం రూ.5 లక్షల మంజూరుకు కృషి చేశారు. దాతృత్వంతో స్పందించిన ఎస్పీకి ఇమామ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే



కారేపల్లి ఎంపీడీఓ ఆఫీస్‌లో మాట్లాడుతున్న ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీజ

కారేపల్లి/ఏన్కూరు: ఓటర్లుగా అర్హత సాధించిన వారి నమోదుకు ఇంటింటి సర్వే చేపట్టాలనిస్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. కారేపల్లి, ఏన్కూరులో తహసీల్, ఎంపీడీఓ కార్యాలయాలను గురువారం సందర్శించిన ఆమె గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా రూపకల్పనను పరిశీలించి అధికారులను సమీక్షించారు. బదిలీ అయిన గ్రామ కార్యదర్శులను రిలీవ్ చేయాలని తెలిపారు. అలాగే, కారేపల్లిలో కేజీబీవీని సందర్శించిన ఆమె, ఏన్కూరులో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై ఆరా తీశారు. తహసీల్దార్లు సంపత్‌కుమార్, సీహెచ్.శేషగిరిరావు, ఎంపీడీఓలు రమేష్, సకినాల రమేష్, ఉద్యోగులు నరసింహారావు, ఎస్‌కే.పర్వీనా, జీవీఎస్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి అప్రజాస్వామికం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

కొత్తగూడెం అర్బన్: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ గుండాల దాడిని ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇది అప్రజాస్వామికమని, పిరికిపందల చర్య అని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు ఇంటిపై, ఖమ్మం వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చినప్పుడు దాడి చేయడం దారుణమని అన్నారు. పథకం ప్రకారమే బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ దాడులు చేస్తోందని ఆరోపించారు. దాడులు తమకు చేతకాక కాదని, తమ నాయకుడు ఆదేశిస్తే అగ్నిగుండమే అవుతుందని పేర్కొన్నారు. దాడులన్నీ సీఎం రేవంత్‌రెడ్డి కనుసన్నల్లోనే జరుగుతున్నాయని విమర్శించారు. ఈ తాటాకు చప్పుళ్లకు బీఆర్‌ఎస్ భయపడదని ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని పేర్కొన్నారు.

ఇలాగే వదిలేస్తారా...?



ప్రమాదకరంగా మారిన దారి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం–బచ్చువారిగూడెం గ్రామాల మధ్యలో ఉన్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. గత జూలై 18న కురిసిన భారీ వర్షాలతో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో బీటీ రహదారి దాదాపు 300 మీటర్ల వరకు కోతకు గురై అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో భారీ గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట రాకపోకలు సాగించే వాహనాలు కొంచెం అదుపుతప్పితే ప్రమాదం బారిన పడాల్సిందే. రోడ్డు కోతకు గురై దాదాపు 50 రోజులు కావొస్తున్నా రోడ్లు భవనాల శాఖ అధికారులు కనీసం ప్రమాదాలు జరగకుండా హెచ్చరికలు కూడా ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ట్రాఫిక్‌లో నిలిచిన మంత్రి కాన్వాయ్



వంతెనపై స్తంభించిన ట్రాఫిక్

వైరారూరల్: వైరా మండలం స్టేజీ పినపాక హైలెవల్ వంతెనపై ట్రాఫిక్‌లో గురువారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్ కొద్దిసేపు నిలిచిపోయింది. హైలెవల్ వంతెన జాయింట్లపై ఏర్పడిన భారీ గుంతలో లారీ నిలిచిపోయింది. దీంతో రెండువైపులా ట్రాఫిక్ స్తంభించింది. అదే సమయాన సత్తుపల్లి వైపు నుండి ఖమ్మం వెళ్తున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాన్వాయ్ వంతెనపైకి రావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మరో ట్రక్కుతో వంతెనపై నిలిచిన లారీని కిందకు దించాక మంత్రి వాహనాలను పంపించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఏ క్షణం.. ఏం జరుగునో..!





మూడు కార్యాలయాలు కొనసాగుతున్న శిథిల భవనం, (ఇన్‌సెట్) శిథిలావస్థలో ఉన్న పోర్టికో పిల్లర్

- శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల భవనాలు
- నిత్యం భయాందోళనతో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు

పాల్వంచరూరల్: ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. క్షణం క్షణం భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కూలిపోయే స్థితిలో ఉన్న పాఠశాల భవనాలను అయినా పునర్‌నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కానీ ప్రభుత్వాలు మాత్రం నిధులు మంజూరు చేయడంలేదు. కొత్త భవనాలు నిర్మించడంలేదు. భారీవర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలి ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

1939 నాటి భవనంలో 'సీతారామ' కార్యాలయం

పట్టణంలోని పాత ఆర్డీఓ కార్యాలయం భవనంలో సీతారామ భూసేకరణ ఎత్తిపోతల ప్రాజెక్టు కార్యాలయం కొనసాగిస్తున్నారు. ఈ భవనాన్ని 1939లో నిర్మించారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరింది. ఇదే ఆవరణలో 1989లో మరో భవనం నిర్మించారు. ఇందులో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఐటీడీఏ ఇంజనీరింగ్ డీఈ కార్యాలయం, వ్యవసాయశాఖ, సాంఘిక సంక్షేమ డివిజన్ కార్యాలయాలు కొనసాగిస్తున్నారు. పైఅంతస్తులో ఇరిగేషన్‌శాఖ డీఈ కార్యాలయం ఉండగా భవనం శిథిలావస్థకు చేరిందని రెండేళ్ల క్రితం ఖాళీచేశారు. కింది అంతస్తులో మాత్రం మూడు ప్రభుత్వ శాఖల కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఈ భవనం పోర్టికో పూర్తిగా బీటలు వారింది. పోర్టుకో శిథిలావస్థలో ఉందని, దీని కింద ఎవరు నిలబడొద్దని పిల్లర్‌పై రాసి ఉంచడం గమనార్హం. వర్షం వస్తే అన్ని కార్యాలయాలూ కురుస్తున్నాయి. గిరిజన సహకార సంస్థ(జీసీసీ) బ్రాంచ్ మేనేజర్ కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరింది. గోదాములు కూడా శిథిలమై వర్షానికి కురుస్తోంది. దీంతో నిల్వ చేసిన బియ్యం , ఇతర నిత్యావసర సరుకులు తడిసిపోతున్నాయి.



సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ కార్యాలయం కొనసాగిస్తున్న పురాతన భవనం

పాఠశాలల భవనాలు కూడా..

కిన్నెరసాని గిరిజన గురుకుల ప్రతిభ జూనియర్ కళాశాల, పాఠశాల భోజనశాల 1975లో నిర్మించారు. ఇది కూలిపోయే స్థితికి చేరినా, వర్షంతో కురుస్తున్నా భోజనశాలగా వినియోగిస్తూనే ఉన్నారు. యానంబైల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే కురుస్తోంది. నాగారం హైస్కూల్ భవనం పరిస్థితి కూడా అలాగే ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శిథిల భవనాలను తొలగించి, కొత్త భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.





కూలిపోయే స్థితిలో ఉన్న యానంబైల్ పాఠశాల భవనం, (ఇన్‌సెట్) శిథిలావస్థలో ఉన్న జీసీసీ బ్రాంచ్ మేనేజర్ కార్యాలయం

వరద బాధితులకు ఎంత చేసినా తక్కువే..

- ప్రజల ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్

ఖమ్మంమయూరిసెంటర్: వరద ప్రభావిత ప్రాంతాలను ప్రత్యక్షంగా చూస్తుంటే బాధితులకు ఎంత చేసినా తక్కువే అన్నట్లుగా ఉందని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాలైన బొక్కలగడ్డ, నయబజార్‌ల్లో గురువారం పర్యటించిన ఆయన బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. హైదరాబాద్‌లో నివసించే ఖమ్మం మిత్రులు, మదార్‌సాబ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఆతర్వాత నయాబజార్ కళాశాలలో వరదతో జరిగిన నష్టాన్ని పరిశీలించగా వివరాలను ప్రిన్సిపాల్ వెల్లడించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు ఎదురైనప్పుడు ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడమే కాక, వాతావరణంలో వస్తున్న మార్పులకు తగినట్లుగా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్నేరు వరద బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారని, వారికి తక్షణ సహాయంతో పాటు మనోధైర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తక్షణ సాయం రూ.16,500 ఇవ్వడమే కాక మరింత సాయం అందించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కాగా, నయాబజార్ పాఠశాలలో సర్టిఫికెట్లు కోల్పోయిన బాధితులు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాటుచేసిన కేంద్రాన్ని కోదండరామ్ పరిశీలించారు. తెలంగాణ జన సమితి జిల్లా ఇన్‌చార్జ్ గోపగాని శంకర్‌రావు, కన్వీనర్ బాబు, నాయకులు అంబటి శ్రీనివాస్, బైరి రమేష్, ఎం.నరసయ్యతో పాటు సీహెచ్.వీరారెడ్డి, జైపాల్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, సురేష్, కృష్ణవేణి పాల్గొన్నారు.



నయాబజార్ కళాశాలలో దెబ్బతిన్న కంప్యూటర్లు, ఫర్నీచర్‌ను పరిశీలిస్తున్న కోదండరామ్

ఎరుపు జిల్లాలో ఏచూరి అడుగులు

- ఉమ్మడి జిల్లాతో సీతారామ్‌కు అనుబంధం
- తమ్మినేని వీరభద్రం 'దుమ్ముగూడెం' యాత్రకు హాజరు
- గత ఏడాది నవంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి రాక

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఉమ్మడి ఖమ్మం జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉంది. జిల్లాలో ప్రజాతంత్ర ఉద్యమాల నిర్వహణలో ఆయన భాగస్వామ్యం ఉంది. గురువారం సీతారాం మృతి చెందడంతో పలువురు ఆయనతో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 30 ఏళ్లుగా జిల్లాతో అనుబంధం కొనసాగిస్తున్న ఆయన ఇక్కడ నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులు, సైద్ధాంతిక అవగాహన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఖమ్మంలో 2012లో నిర్వహించిన ఉమ్మడి ఏపీ రాష్ట్ర మహాసభల విజయవంతంలోనూ ఏచూరి కీలకంగా వ్యవహరించారు. ఆ మహాసభల సమయాన వారం పాటు ఖమ్మంలోనే ఉండి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. 2008 జూలై 28న ముదిగొండలో నిర్వహించిన భూపోరాట అమరవీరుల ప్రథమ వర్థంతి సభకు సైతం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చివరిగా గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చారు. ఖమ్మంలోని మంచికంటి మీటింగ్ హాల్‌లో 'ఎన్నికలు – ప్రజాస్వామ్యం–సీపీఎం వైఖరి'పై నవంబర్ 25న నిర్వహించిన సెమినార్‌లో పాల్గొన్నారు. అదేరోజు ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెంలో పార్టీ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ప్రచార సభలో మాట్లాడారు. ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరిగిందని.. ప్రలోభాలకు లోనై ఓటును దుర్వినియోగం చేసుకోవద్దని పిలుపునిచ్చారు.

వామపక్ష ఉద్యమాల్లో ..

ఉమ్మడి జిల్లాలో చేపట్టిన అనేక వామపక్ష, ప్రజాతంత్ర ఉద్యమాలను ఏచూరి హాజరై ముందుకు నడిపారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, అఖిల భారత కార్యదర్శిగా వివిధ హోదాల్లో వివిధ కార్యక్రమాలకు హాజరయ్యారు. భక్త రామదాసు కళాక్షేత్రం, సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన సభల్లో ప్రసంగించారు. ఏచూరి ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా కార్యదర్శిగా ఉన్న సమయాన ఉమ్మడి జిల్లాలో యూనియన్ బాధ్యతలు నిర్వర్తించిన పలువురికి ఆయనతో ప్రత్యక్ష అనుబంధం ఏర్పడింది. ఆయా నాయకులు ప్రస్తుతం డాక్టర్లుగా, న్యాయవాదులుగా కొనసాగుతున్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు సాధన కోసం 2003లో తమ్మినేని వీరభద్రం నిర్వహించిన మహాప్రస్థానం పాదయాత్రలో తెల్దారుపల్లి నుంచి ఖమ్మం వరకు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతిపై పలువురి నివాళి

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఏచూరితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఖమ్మంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొని ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా వేర్వేరు ప్రకటనల్లో ఏచూరి మృతిపై సంతాపం తెలిపారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని, నాయకులు



సీపీఎం ఖమ్మం జిల్లా కార్యాలయానికి వచ్చిన సమయాన నాయకులతో సీతారాం ఏచూరి (ఫైల్)

ఉరివేసుకుని ఆత్మహత్య

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఒకేరోజు వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తిప్పనపల్లి గ్రామానికి చెందిన తాపీమేస్త్రి సయ్యద్ జిలాని (48) కుటుంబ కలహాల నేపథ్యంలో ఇంటి పెరటిలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా భార్యతో అతనికి మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో భార్య గ్రామంలోనే ఉన్న పుట్టింటికి వెళ్లింది. రోజులు గడుస్తున్నా ఆమె ఇంటికి రాకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నసీమా, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇ.స్వప్న తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అనారోగ్యంతో మరొకరు..

తిప్పనపల్లి శివారు తండాకు చెందిన గుగులోత్ సోమ్లా (58) పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. సోమ్లా కొన్నినెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే అతను తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. భార్య మోతి ఫిర్యాదు మేరకు ఎస్సై స్వప్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

40 లీటర్ల నాటుసారా సీజ్

బూర్గంపాడు: సారపాక ప్రధానకూడలిలో 40 లీటర్ల నాటుసారాను గురువారం పోలీసులు పట్టుకున్నారు. భద్రాచలం సమీపంలోని పండువారిగూడెం గ్రామానికి చెందిన మాలోత్ అచ్చిమి అనే మహిళ 40 లీటర్ల నాటు సారా తీసుకెళ్తుండగా సారపాక ప్రధానకూడలిలో పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

సాయికృష్ణ గల్లంతుపై కేసు నమోదు



సాయికృష్ణ

పాల్వంచరూరల్: వాగులో వ్యక్తి గల్లంతైన ఘటనలో పోలీసులు గురువారం అదృశ్యం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామానికి చెందిన జారే సాయికృష్ణ (23) ఈ నెల 1న పాల్వంచ మండలం గంగదేవిగుప్ప గ్రామంలోని అత్తగారింటికి భార్య మమత, ఇద్దరు బిడ్డలతో కలిసి వచ్చాడు. 4న తోడల్లుడు కుంజా భద్రంతో కలిసి పశువులు తోలుకుని కిన్నెరసాని వాగులోని దీవికి వెళ్లాడు. అదే రోజు సాయంత్రం వాగు దాటే క్రమంలో గల్లంతయ్యాడని అతని భార్య ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి. సురేష్ తెలిపారు.

గ్రామపంచాయతీ కార్యదర్శికి బెదిరింపులు

టేకులపల్లి: బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడిపై గురువారం కేసు నమోదైంది. టేకులపల్లి ఎస్‌ఐ పి.సురేష్ కథనం ప్రకారం.. పంచాయతీ కార్యదర్శి వి.దీప్తి గ్రామ పంచాయతీలో సిబ్బందితో పనులు చేయిస్తున్న సమయంలో గోలియా తండా పంచాయతీ వాగొడ్డుతండాకు చెందిన బాణోతు నరేష్ వచ్చి దురుసుగా ప్రవర్తించాడు. అసభ్యపదజాలంతో దూషించి విధులకు ఆటంకం కలిగించాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేశారు.

బైక్ దొంగ అరెస్ట్

దమ్మపేట: మండలంలో వరుస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కథనం ప్రకారం.. గోలి నాగరాజు అనే వ్యక్తి దమ్మపేటలోని మార్కెట్ యార్డు వద్ద నివాసం ఉంటూ మండలంలో వివిధ గ్రామాల్లో బైక్‌లను చోరీ చేస్తున్నాడు. వాటిని తాకట్టుపెట్టి జల్సాలకు అలవాటుపడ్డాడు. గురువారం అయ్యప్పస్వామి గుడి వద్ద తనిఖీలు చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన నాగరాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. దీంతో నేరం అంగీకరించగా, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగరాజుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

పశువుల లారీ స్వాధీనం

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామంలో ఇటుక బట్టీల సమీపంలో పశువులను తరలిస్తున్న లారీని సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. లారీలో సుమారు 30 పశువులు ఉన్నట్టు సమాచారం. పోలీసులను చూసి పశువులను తరలిస్తున్న వ్యక్తులు పారిపోగా లారీని స్టేషన్‌కు తరలించారు. అవి ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారో సమాచారం తెలియాల్సి ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కొత్తగూడెం జిల్లా ఆస్పత్రి మార్చురీలో ఉంచిన మృతదేహం

కొత్తగూడెం అర్బన్: పట్టణ పరిధిలోని సెవెన్ హిల్స్ ఏరియాలో హోటల్ వద్ద గురువారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో త్రీటౌన్ పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుందని, సమాచారం తెలిసినవారు 87126 82026 నంబరులో సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతు...



రామారావు (ఫైల్)

ఏన్కూరు: పొలం వద్ద మోటార్ ఆన్ చేసే క్రమాన విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. మండలంలోని శ్రీరాంగిరికి చెందిన దుగ్గినేని రామారావు(70) బుధవారం సాయంత్రం తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ మోటర్ ఆన్ చేసేక్రమంలో ప్రమాదవశాత్తు కాలికి వైరు తాకగా షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, రాత్రి వరకు ఈ విషయాన్ని ఎవరు గుర్తించలేదు. అప్పటివరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పొలానికి వెళ్లి చూడగా రామారావు మృతదేహం కనిపించింది. ఆయన భార్య దుర్గమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాదావత్ రవి తెలిపారు.

వెంగళరాయ సాగర్‌ను ఆధునికీకరిస్తాం

ఎమ్మెల్యే ఆదినారాయణ

చండ్రుగొండ: మండలంలోని సీతాయిగూడెంలో ఉన్న వెంగళరాయ సాగర్‌ను ఆధునికీకరిస్తామని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ప్రాజెక్టు అలుగుకు, తాజాగా కుడి కాల్వకు పడిన గండిని గురువారం ఆయన పరిశీలించారు. నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డితో ప్రాజెక్ట్ పరిస్థితిని సమీక్షించి మాట్లాడారు. రూ.34 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించామని, వచ్చే త్వరలోనే నిధులు వస్తాయని తెలిపారు. వచ్చే వ్యవసాయ సీజన్ కల్లా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామన్నారు. ప్రస్తుతం గండి పడిన ప్రాంతాల్లో మరమ్మతు చర్యలు చేపట్టామని, ఇందుకు రూ.10 లక్షల నిధులు ఫ్లడ్‌గ్రాంట్ ద్వారా మంజూరు చేసినట్లు వివరించారు. నీటిపారుదల శాఖ ఈఈ అర్జున్, డీఈ కృష్ణశంకర్, ఏఈ నరసింహారావు, కాంగ్రెస్ నాయకులు భోజ్యానాయక్, కృష్ణారెడ్డి, బానోతు రాములు, పి.సురేష్, రైతులు పాల్గొన్నారు.



గండి పడిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, అధికారులు

ములకలపల్లి నుంచి తొలి మహిళా ఎస్సై

శిక్షణ పూర్తి చేసిన సాయిన్ని నవిత

ములకలపల్లి: మండలానికి చెందిన సాయిన్ని నవిత తొలి మహిళా సివిల్ ఎస్సైగా శిక్షణ పూర్తి చేశారు. మండల పరిధిలోని సూరంపాలెం గ్రామానికి చెందిన సాయిన్ని దుర్గావాణి, రమణారావు దంపతుల కూతురు నవిత జగన్నాథపురం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యనభ్యసించారు. 2021లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం ఆమె మేనమామ అనుమల సత్యనారాయణ దంపతుల ప్రోత్సాహంతో పోలీస్‌శాఖలో కొలువుపై దృష్టి సారించారు. 2023లో పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షలో తొలి ప్రయత్నంలోనే సివిల్ ఎస్సై పోస్టు దక్కించుకున్నారు. హైదరాబాద్‌లో శిక్షణ పూర్తికాగా, బుధవారం రాష్ట్ర పోలీస్ అకాడమీలో నిర్వహించిన పాసింగ్ ఔట్ పరేడ్ (పీఓపీ) పూర్తి చేశారు. ఈ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి నూతన ఎస్సైలకు దిశానిర్దేశం చేశారు. మారుమూల ఏజెన్సీ మండలమైన ములకలపల్లి నుంచి ఎస్సైగా నవిత బాధ్యతలు స్వీకరించనుండడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పక్కా ప్రణాళికతో సాధన చేయడంతో తొలి ప్రయత్నంలోనే ఎస్సై పోస్టు దక్కించుకున్నానని, మహిళలు అన్నిరంగాల్లోనూ రాణించాలని, ప్రజాసేవే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా నవిత తెలిపారు.



ఎస్సై శిక్షణ పూర్తి చేసిన నవిత

1,116 దీపాలతో అలంకరణ

వినాయక చవితి నవరాత్రుల వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం టేకులపల్లి సెంటర్‌లోని మండపంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 1,116 దీపాలతో శివలింగం, ఓమ్, స్వస్తిక్ ఆకారాల్లో దీపాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి బజారులో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – టేకులపల్లి



దీపాలతో అలంకరించిన భక్తులు